క్లుప్తంగా

యోగా పోటీల్లో తానాం విద్యార్థుల సత్తా



ఎస్జీఎఫ్ యోగా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సుహాసిని

పరవాడ: నెల్లూరులో ఈ నెల 2, 3 తేదీల్లో జరిగిన ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో తానాం గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని యోగా శిక్షకుడు సీహెచ్ ఆంజనేయులు తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన తమ విద్యార్థులు, డిసెంబర్లో ముంబయిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతారని పేర్కొన్నారు. రిథమిక్ విభాగంలో కె.వెంకటవైష్ణవి బంగారు పతకం, ఎస్.కౌశిక రజతం, ట్రెడిషనల్లో డి.హర్షిత రజతం, ఎస్.ఝాన్సీలక్ష్మి కాంస్యం, ఆర్టిస్టిక్లో బి.వైష్ణవి రజత పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను బీసీ వెల్ఫేర్ మంత్రి ఎస్.సవిత, బీసీ వెల్ఫేర్ రాష్ట్ర కార్యదర్శి ఎ.కృష్ణమోహన్, పాఠశాల ప్రిన్సిపాల్ వై.ఎస్.సుహాసిని, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలకు గురుకుల విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రామకృష్ణ, బోధనా సిబ్బంది

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ సోమవారం మీడియాకు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా శ్రీసారథి విద్యాలయంలో గత నెల 28న జరిగిన పోటీల్లో పాఠశాల విద్యార్థులు అండర్-14 విభాగంలో జె.కిరణ్ కుమార్, జె.నిషాల్, అండర్-17లో పి.రాము, ఎం.లలిత్ కుమార్, అండర్-19లో జె.చిన్న అచ్చారావు, జి.కమలాకర్ ఎంపికయ్యారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు సీఎల్ఎన్ ప్రసాద్, వి.సూర్యనారాయణలను ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

సమస్యల పరిష్కారానికి సహకరించండి



జీవీఎల్‌ను సత్కరిస్తున్న ముమ్మన దేముడు

పెందుర్తి: వార్డులోని సమస్యలు పరిష్కరించి.. అభివృద్ధి పథంలో నిలిపేందుకు తగిన సహకారం అందించాలని బీజేపీ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావును 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు కోరారు. ఈ మేరకు సోమవారం నగరంలోని జీవీఎల్ నివాసంలో కలుసుకుని పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 5 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హైమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 5 వినతులు అందాయి. జీవీఎంసీ 97వ వార్డులోని సుజాతనగర్ కూడలి సమీపంలో 80 అడుగుల రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, అదే వార్డు సుజాతనగర్ ప్రధాన రహదారి ఫ్రీ లెఫ్ట్ తొలగించి, రోడ్లు, కాలువలు బాగుచేయాలని, 92వ వార్డు శ్రీసాయినగర్ కాలనీలో కుక్కల బెడద, అదే కాలనీలో కాలువలు శుభ్రం చేయాలని, 95వ వార్డు లక్ష్మీపురంలో యూజీడీ అనుసంధానం చేయాలని ప్రజలు జోనల్ కమిషనర్ హైమావతిని కోరారు. ఆయా వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్-8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తవ్వుకో.. తరలించుకో.. దోచుకో

పెందుర్తి మండలం నరవలో ప్రకృతి వనరుల దోపిడీ నిరాటంకంగా కొనసాగుతోంది. స్థానిక టీడీపీ, జనసేన నాయకులు ప్రభుత్వ వనరులైన కొండలు, గుట్టల్ని కొల్లగొడుతున్నారు. రెవెన్యూ, మైనింగ్ ఉన్నతాధికారులు బదిలీ కావడంతో కూటమి నేతలు మళ్లీ అక్రమ తవ్వకాల బాట పట్టారు. ఎప్పటిలాగే ప్రభుత్వం తమదైతే.. తమ చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములు కూడా తమవే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.







- గ్రావెల్‌ను కొల్లగొడుతున్న టీడీపీ, జనసేన నాయకులు
- రాత్రుళ్లు తవ్వి గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేట్ స్థలాల్లో నిల్వ
- పగటిపూట టిప్పర్లలో తరలించి అమ్మకాలు
- చేష్టలుడిగి చూస్తున్న మైన్స్, రెవెన్యూ అధికారులు

పెందుర్తి మండలం నరవ సర్వే నం.29, 27/8లోని ప్రభుత్వ భూముల్లో తరలించుకుపోయిన గ్రావెల్ (ఇన్‌సెట్) టీడీపీ నాయకులు అక్రమంగా నిల్వ చేసిన గ్రావెల్

పెందుర్తి: స్థానిక టీడీపీ-జనసేన నాయకులు అధికారం తమదైతే ప్రకృతిలోని సహజ వనరులను దోచుకునేందుకు లైసెన్స్ పొందినట్లే అన్న రీతిన ఇష్టానుసారం చెలరేగిపోతున్నారు. అడవులు, ప్రభుత్వ భూముల్ని కొల్లగొట్టి రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. వారం రోజులుగా పెందుర్తి మండలం నరవ సర్వే నెం.29, 27/8లలో ఉన్న ప్రభుత్వ భూముల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జోరందుకున్నాయి. ప్రభుత్వ అనుమతితో పనిలేకుండా రేయింబవళ్లు పొక్లెయిన్ల సాయంతో గ్రావెల్ తవ్వి, టిప్పర్లలో తరలించి అమ్ముకుంటూ రోజూ రూ.లక్షల్లో వెనకేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా గనులు, రెవెన్యూ శాఖ అధికారులు మాత్రం కళ్లకు గంతలు కట్టుకుని తిరుగాడుతున్నారు. ఎప్పుడైనా ఫిర్యాదులు, మీడియాలో వార్తలు వచ్చినపుడు మాత్రం తూతూ మంత్రం చర్యలతో సరిపుచ్చుతున్నారన్న ఆరోపణల్ని మూటగట్టుకుంటున్నారు.

బరితెగించేశారు

నరవ ప్రాంతంలో ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు కొత్తకాదు. పుష్కరకాలంగా ఇక్కడ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ అక్రమ తవ్వకాలకు గత ప్రభుత్వం చాలా వరకు అడ్డుకట్ట వేసింది. ఎక్కడికక్కడ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరిపి, తవ్వకాలను నిరోధించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, స్థానిక టీడీపీ-జనసేన నాయకులు జూలు విదిల్చారు. గతంలో చాటుమాటుగా జరిపిన అక్రమ తవ్వకాలు నాలుగైదు నెలలుగా బాహాటంగానే సాగిస్తున్నారు. పగలూ రాత్రి తేడా లేకుండా కొండలు, గుట్టల్ని తవ్వి, ఇష్టానుసారం గ్రావెల్ దోపిడీ చేస్తున్నారు. ఈ గ్రావెల్‌ను టిప్పర్లతో మరో ప్రాంతానికి తరలించి అక్కడి ప్రైవేట్ స్థలంలో నిల్వ చేస్తున్నారు. ఒకవేళ అధికారులు దాడులు చేసినా ప్రైవేటు స్థలంలో ఉన్న గ్రావెల్‌పై మీ పెత్తనమేంటని దబాయిస్తున్నారు. వీలు చూసుకుని ఆ గ్రావెల్‌ను అమ్ముకుని అడ్డగోలుగా ఆర్జిస్తున్నారు.

అప్పట్లో వ్యతిరేకించి.. ఇప్పుడు కుమ్మక్కై!

వాస్తవానికి ఇక్కడి అక్రమ గ్రావెల్ తవ్వకాల్లో స్థానిక టీడీపీ నాయకులదే హవా. గత ప్రభుత్వంలో వీరికి అడ్డుకట్ట పడినా.. అడపాదడపా రాత్రుళ్లు టీడీపీ నాయకులు తమ కక్కుర్తి బుద్ధి చూపేవారు. వీరి దోపిడీకి వ్యతిరేకంగా స్థానిక జనసేన నాయకులు ప్రత్యక్ష పోరాటాలకు కూడా దిగారు. ఆ పార్టీ రాష్ట్ర స్థాయి నేత, ప్రస్తుత ఎంఎస్ఎంఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ నేతృత్వంలో ఆందోళనలు కూడా చేశారు. ఎప్పుడైతే కూటమికట్టి, అధికారంలోకి వచ్చారో.. అప్పటి నుంచి ఇరుపార్టీల స్థానిక నాయకులు కుమ్మక్కయ్యారు. నీకింత.. నాకింత అని సర్దుకుని, యథేచ్ఛగా గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు.

పట్టని నిబంధనలు

గృహనిర్మాణం, రోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణ సమయంలో ఫిల్లింగ్ కోసం గ్రావెల్ వినియోగిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్, పట్టా భూముల్లో మట్టి తవ్వి, తరలించాలంటే స్థానిక రెవెన్యూ అధికారుల నుంచి ఆమోదం(ఎన్‌వోసీ) తప్పనిసరి. దీని ఆధారంగా భూగర్భ గనుల శాఖను సంప్రదించాలి. వారి నుంచి ముందుగానే ఆన్‌లైన్ పర్మిట్లు తీసుకుని, తవ్వకాలు జరపాలి. ఇందుకు క్యూబిక్ మీటర్‌కు రూ.105 రాయల్టీ చెల్లించాలి. ఇవేవీ లేకుండానే నరవలో ప్రకృతి సంపద దోపిడీకి గురవుతోంది. రోజూ 10 నుంచి 15 లారీలు ఇక్కడ తిరుగుతున్నాయి. ఒక్కో లారీ రోజుకు కనీసం 10 ట్రిప్పులు తిరుగుతున్నాయి. ఒక్కో లోడుకు దూరాన్ని బట్టి రూ.2,500 నుంచి రూ.5 వేలు వరకు వసూలు చేస్తూ, అడ్డగోలుగా ఆర్జిస్తున్నారు. ఈ లెక్కన చూస్తే హీనపక్షంగా అనుకున్నా రోజుకు రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వెనకేసుకుంటున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

పెందుర్తికి ఇటీవలే బదిలీపై వచ్చాను. నరవలో అక్రమ గ్రావెల్ తవ్వకాల విషయం నా దృష్టికి రాలేదు. ఆయా ప్రాంతాలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టిలో పెడతాం. అక్రమ తవ్వకాలు జరిగితే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– హరి ప్రసూన్న, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పెందుర్తి

బాలికల హాస్టల్‌కు రాంకీ ఫౌండేషన్ వితరణ



హాస్టల్‌కు ఐరన్ షెల్ఫ్‌లు, వంట పాత్రలను అందిస్తున్న రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు

పరవాడ: స్థానిక ప్రభుత్వ బాలికల వసతి గృహానికి రాంకీ ఫౌండేషన్ మంజూరు చేసిన ఐదు ఐరన్ షెల్ఫ్‌లు, వంట పాత్రలు, స్టవ్, గ్రైండర్‌ను హాస్టల్ వార్డెన్ సుజాతకు ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌బక్షి సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులతో పాటు రాంకీ ఫౌండేషన్ బీసీ, ఎస్సీ హాస్టళ్లకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతేడాది వసతి గృహం నుంచి టెన్త్ క్లాస్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఫౌండేషన్ ద్వారా ఉపకార వేతనాలు అందించామన్నారు. రాంకీ ఫౌండేషన్ అందిస్తున్న సహాయ సహకారాలకు హాస్టల్ వార్డెన్ సుజాత కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ ఉద్యోగులు శ్రీనివాస్, రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక భేటీ



ఎమ్మెల్యే రమేష్‌బాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రామలింగారెడ్డి

పెందుర్తి: జీవీఎంసీ జోన్-8 టౌన్ ప్లానింగ్ ఏసీపీగా నియమితులైన రామలింగారెడ్డి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలని ఈ సందర్భంగా ఏసీపీకి ఎమ్మెల్యే పంచకర్ల సూచించారు.

రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ఎంపిక



ఈత పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఈత పోటీల్లో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి సోమవారం తెలిపారు. ప్రతిభ కనబర్చిన జి.ధార్మిక, ఐ.వైష్ణవి, బి.లాస్య వర్షిత, స్మృతి రాణి, జి.రోషిణి, ఆర్.తేజ, జి.తరుణ్, జె.జయదేవ్‌లు పల్నాడు జిల్లా నర్సారావుపేటలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంగారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ఎంపికైన విద్యార్థులను, కోచ్ హరినాథ్‌రెడ్డిని యాజమాన్యం అభినందించింది. జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించాలని పాఠశాల సీఈవో కె.నిశాంత్ అభిలషించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పరవాడ: ఎన్ఆర్ఈజీఎస్, గ్రామ పంచాయతీ సంయుక్త నిధులతో చేపట్టిన పెదముషిడివాడ - ఈ.మత్రిపాలెం సీసీ రోడ్డును గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సీసీ రోడ్డు నిర్మాణం ద్వారా మార్కండేయ నగర్, జిల్లా పరిషత్ పాఠశాల దరి ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కబడ్డి అప్పారావు, యలమర్తి బుజ్జి చెప్పారు. సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలన్నారు.

న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం చూపుతున్న అసోసియేషన్ సభ్యులు

మహారాణిపేట: వేపగుంటలో సర్వే నెం.3బి, 3సిలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహ ప్రశాంతినగర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం విశాఖ జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. తాము నివసిస్తున్న భూములకు ఏ భూములతో సంబంధం లేదని, అయినప్పటికీ కొంత మంది రెవెన్యూ అధికారులు తప్పదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. తమ భూముల్ని రైతుల నుంచి స్వయంగా కొనుగోలు చేశామన్నారు. కొంత మంది రెవెన్యూ అధికారులు ఈ భూములకు రైత్వారీ పట్టాలు జారీ చేయడం లేదని పేర్కొన్నారు. దేవస్థానం భూములంటూ తమను ఇబ్బంది పెడుతున్నారని, తమకు న్యాయం చేయాలని కోరారు.

ఆక్రమిత స్థలాన్ని విడిచి.. చెరువు గర్భంలోకి రోడ్డు

- కబ్జా చెరలో రూ.2 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని ఆయకట్టు రైతుల ఆవేదన



చెరువు గర్భం వైపు తవ్వి విస్తరిస్తున్న రోడ్డు

సబ్బవరం: ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని విడిచిపెట్టి, చెరువు గర్భంలోకి రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం సరికాదని తవ్వవానిపాలెం ప్రజలు వాపోయారు. తవ్వవానిపాలెం రెవెన్యూ పరిధి సర్వే నెం.416లో అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిని అనుకుని చిన్నయ్యపాలెం మార్కెట్ సమీపంలో సుమారు 2.19 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో 30 సెంట్ల వరకు ఆక్రమణకు గురవగా, మిగిలిన భూమిలో చిన్నయ్యపాలెం రైతు బజార్ ఉంది. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి జాతీయ రహదారిని అనుకుని ఉండటంతో దీని విలువ రూ.2 కోట్లు ఉంటుందని స్థానికులు చెప్తున్నారు. ఈ భూమిలో ఇప్పటికే అక్రమ నిర్మాణాలు వెలిశాయి. వాటిని అనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని విడిచి కొత్తగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు కోసం బుచ్చివాని చెరువు గట్టును తవ్వడం సరికాదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వ నాయకుల సహకారంతో అక్రమార్కులకు అండగా రోడ్డు విస్తరణ చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో పక్కా భవనం నిర్మించుకుని ఉండటం, దాన్ని రక్షించుకోవడానికి పెద్ద మొత్తంలో నగదు చేతులు మారినట్లు చెప్తున్నారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఆయకట్టు రైతులు బోకం శ్రీనివాసరావు తదితరులు ఆక్షేపించారు. రోడ్డు విస్తరణ పనులను చెరువు గర్భం నుంచి కాకుండా ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో సమగ్రంగా సర్వే చేసి మలుపుల్లేని రోడ్డును వేయాలని కోరుతున్నారు. గతంలో ఆక్రమణలపై నిలదీసినవారే ప్రస్తుతం రోడ్డును చెరువు వైపు విస్తరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శివ శివ శంకర.. భక్తవశంకర

- వైభవంగా కార్తీక తొలి సోమవారం పూజలు
- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- పరమ శివుడికి అభిషేకాలు, విశేష అర్చనలు



సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి



అలంకరణలో శ్రమశక్తినగర్ రామలింగేశ్వరుడు



దేవీపురం పంచభూత లింగేశ్వరునికి అభిషేకాలు



శివలింగానికి భస్మాభిషేకం చేస్తున్న స్వామీజీలు



తవ్వవానిపాలెంలో వడ్డన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

పెందుర్తి: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా తొలి సోమవారం శైవక్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. మహాశివుడ్ని అభిషేకాలు, అర్చనలతో ఆరాధించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాల్లో భక్తులు బారులు తీరారు.

- పెందుర్తి సాధూమఠం పురాతన రామలింగేశ్వర స్వామి దేవాలయంలో రుద్రాభిషేకాలు జరిగాయి.
- పినగాడి చోడేశ్వరస్వామి దేవాలయంలో విశేష అభిషేకాలు జరిగాయి. అర్చనలు చేశారు. శివుడ్ని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు.
- సరిపల్లిలోని శివాలయంలో భక్తులు స్వహస్తాలతో క్షీరాభిషేకాలు జరిపారు. మహానంది, ధ్వజ స్థంభాలకు మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు.
- కృష్ణరాయపురంలోని శివాలయం, శ్రమశక్తినగర్ రామలింగేశ్వరస్వామి దేవాలయం, ప్రశాంతినగర్, చింతలగ్రహారం శివాలయం, సుజాతనగర్‌లోని హరహరక్షేత్రం, పెందుర్తి మహా కామేశ్వరి అమ్మవారి ఆలయంలోని జ్యోతిర్లింగాల సన్నిధిలో ఘనంగా పూజలు జరిగాయి.

సింహాచలం: సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి, సింహగిరిపై కొలువుదీరిన కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అభిషేకాలు నిర్వహించారు. ధ్వజస్తంభాలు, నాగేంద్రుడు, రావి, మర్రిచెట్ల వద్ద దీపారాధన చేశారు. త్రిపురాంతకస్వామి ఆలయ అర్చకుడు రమణమూర్తి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ అర్చకుడు శ్రావణ్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

పరవాడ: పరవాడ గ్రామంలో శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో శివుడిని దర్శించుకునేందుకు పరిసర గ్రామాల భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, అభిషేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

- తాడి ఉమానీలకంఠేశ్వర ఆలయంలో పరవాడ మాజీ ఎంపీపీ మాధంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొండపల్లి అప్పారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు జరిపారు.

సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో కొలువైన ఉమా రామలింగేశ్వర స్వామిని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం దర్శించుకుని పూజలు చేశారు. అన్నసమారాధనను ప్రారంభించారు. ఎంపీటీసీ బోకం బాలు, బోకం శ్రావణ్, మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఉపసర్పంచ్ మండల లక్ష్మణ, బోకం కాసుబాబు, సబ్బవరపు బుజ్జి, గొర్లి శ్రీనివాస్, చిరికి దేముడు పాల్గొన్నారు.

- మొగలిపురంలోని శ్రీ విఘ్నేశ్వర ఘాట్ వద్ద ఈశ్వర ఆలయంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు నిర్వహించారు. సుమారు 300 మంది అయ్యప్ప మాలధారులకు మధ్యాహ్నం అన్నసమారాధనను ప్రారంభించారు. తవ్వవానిపాలెంలోని ఉమా రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఉప సర్పంచ్ సిరపరపు వాసు, పార్టీ నాయకులు ఐడీ బాబు, ఎమ్మెల్యే దేముడు, గోలిరెడ్డి కనకరాజు పాల్గొన్నారు.
- ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో భక్తులు పోటెత్తారు. పంచలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

మహాశివునికి భస్మాభిషేకం

పెందుర్తి: శారదాపీఠం ఆధ్వర్యంలో వారణాసిలో జరుగుతున్న 'కాశీలో కార్తీకం'కార్యక్రమంలో రెండో రోజైన సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ పవిత్ర గంగానది స్నానమాచరించారు. రామేశ్వరం నుంచి తీసుకువచ్చిన శివలింగానికి స్వామీజీల చేతుల మీదుగా భస్మాభిషేకం, బిల్వ పత్రాభిషేకం జరిపారు. దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన దాదాపు 60 మంది వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ మహా రుద్ర సహిత శత చండీ యాగ పూర్ణాహుతి శాస్త్రోక్తంగా నిర్వహించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీతలు పండిట్ రాజేశ్వరాచార్య, చంద్రశేఖర్‌సింగ్, రజనీకాంత్, కె.కె త్రిపాఠి, హర్యానా గుంతివాలా మాతాజీ, విదుర ఆశ్రమ కుమారానంద గిరిస్వామి, శ్రీరామ తారక ఆంధ్ర ఆశ్రమ ట్రస్టీ సుందరశాస్త్రి, కంచి మఠం మేనేజర్ సుబ్రమణియన్, గజల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాగదేవతా నమోస్తుతే



పూజలకు సిద్ధం చేసిన పుట్ట

పెందుర్తి: పాలు.. నువ్వుల చిమ్మిలి.. గుడ్లు.. చెరకు గడలు.. తాటి టెంకల గుజ్జు.. తంగేడు పూలు.. నాగదేవతకు ఎంతో ఇష్టం. కార్తీక శుద్ధ చతుర్థినాడు నాగదేవతను పూజించడం సంప్రదాయం. ఈ ఏడాది కూడా పెందుర్తి నియోజకవర్గంలో నాగుల చవితి పూజలు జరిపేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు.

సందడే సందడి

ఏటా నాగుల చవితి పర్వదినాన పల్లెల్లో చాలా సందడి నెలకొంటుంది. తోటల్లో, పొలాల గట్లపై ఉన్న పుట్టల్ని ఒక రోజు ముందుగానే సిద్ధం చేస్తారు. పుట్టలో పాలు పోసి తాటి గుజ్జు, చలిమిడి, చిమ్మిలి సమర్పిస్తారు. పలు చోట్ల ఇంటిల్లపాదీ అక్కడే సహపంక్తి భోజనాలు చేస్తారు. అయితే పట్టణీకరణ పుణ్యమా అని ప్రకృతి సిద్ధమైన పుట్టలు మాయమయ్యాయి. పెందుర్తి నియోజకవర్గంలో సైతం కృత్రిమ పాము పుట్టల వద్దే ప్రజలు పూజలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.